



ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- మార్చి 5 నుంచి 22 వరకు ఎగ్జామ్స్
- జిల్లాలో 29 కేంద్రాల్లో నిర్వహణ
- మాస్ కాపీయింగ్‌కు చెక్ పెట్టేలా చర్యలు
- ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు
- వేసవి దృష్ట్యా విద్యార్థులకు కనీస సౌకర్యాల కల్పన
- 100 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు

ఇంటర్ పరీక్షలు.. సీసీ కెమెరాల నిఘా నీడలో జరగనున్నాయి. మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రశ్నాపత్రాల బాక్స్‌లు తెరవడం నుంచి సమాధాన పత్రాల ప్యాకెట్లు సీల్ చేయడం వరకూ అంతా పకడ్బందీగా జరగనుంది. ఇటీవల జరిగిన ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపట్టనున్నారు. పరీక్షల్లో అక్రమాలు చోటు చేసుకోకుండా రెండు సిట్టింగ్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించగా, డెక్ ఆధ్వర్యంలో ఇద్దరు సభ్యులు కలిగిన తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేశారు.



జిల్లాలో పరీక్షలు రాయనున్న విద్యార్థులు	
జనరల్	13,569
వొకేషనల్	2,870
మొత్తం	16,439
ఫస్టియర్	7,914
సెకండియర్	6,963
ప్రైవేట్ విద్యార్థులు	1,562

వికారాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఈనెల 25న సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రెండు సెట్ల ప్రశ్నపత్రాలు సంబంధిత పోలీసు స్టేషన్లలో భద్రపరిచారు. మరో సెట్ ప్రశ్నపత్రాలు రానున్నాయి. శుక్రవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సీఎస్, డీవోలతో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వారికి పరీక్షల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాల గురించి డీఐఈవో అవగాహన కల్పించనున్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల ప్రశ్నాపత్రాలు మూడు సెట్లు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన పట్టణాలు, మండల కేంద్రాల్లోని

మిగతా 8వ పేజీలో...

వికారాబాద్ అభివృద్ధికి ఎన్ని నిధులైనా తెస్తా..

» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అభివృద్ధికి ఎన్ని నిధులైనా తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మర్పల్లి మండలంలోని కేసారం నుంచి రావులపల్లి వరకు రూ.కోటీ 87 లక్షలు, కల్కోడ నుంచి తొరమామిడి వరకు రూ.కోటీ 62 లక్షలతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని విడతల వారీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అక్కడి నుంచి మండలంలోని రావల్‌పల్లి గ్రామంలో పార్వతీ పరమేశ్వర సమేత పీతంబరేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు స్పీకర్‌కు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాములుయాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కలీమొద్దీన్, రామేశ్వర్, సురేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మండల ఉపాధ్యక్షుడు రాచన్న, అశోక్‌రెడ్డి, అబ్రహం, బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

దుద్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పోలెపల్లి ఎల్లమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎల్లమ్మను దర్శించుకున్నానని, తిరిగి మళ్లీ దర్శించుకున్నట్లు తెలిపారు. ఎల్లమ్మ ఆశీర్వాదంతో పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచినట్లు చెప్పారు. వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రావణ్‌గౌడ్, రాములు, మల్లేశ్, శ్రీకాంత్, వెంకటేశ్‌రెడ్డి, బాబు, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి దివ్యాంగుల ఎంపిక

వికారాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 3 నుంచి 5 వరకు దివ్యాంగుల అర్హుల ఎంపికకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్ ధర్మ విద్యాలయంలో జరిగే ఈ శిబిరంలో భారత ప్రభుత్వం ఏడీఐపీ పథకం కింద అర్హత కలిగిన దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ మెటరైజ్డ్ ట్రై సైకిళ్లు, హ్యాండ్ ప్రొపెల్డ్ ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్ హియరింగ్ వంటి ఉపకరణాలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కనీసం 40 శాతం వైకల్య ధ్రువీకరణ పత్రం ఉండాలని, లబ్ధిదారులు లేదావారి సంరక్షకుల మొత్తం నెలవారీ ఆదాయం రూ.22,500 లోపు ఉండాలని, ప్రభుత్వ అధికారి, ఎమ్మెల్యే, ఎంపీ ధ్రువీకరణ, లేదా బీపీఎల్ రేషన్ కార్డు, దివ్యాంగ పెన్షన్ రుజువు ద్వారా ఆదాయ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని పేర్కొన్నారు. దివ్యాంగుడి ఆధార్ కార్డు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు కాపీలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఈ క్యాంపులో ఎటువంటి సర్టిఫికెట్లు అందివ్వడం ఉండదని తెలిపారు. సర్టిఫికేట్లు ఉన్నవారికి ఉచిత సహాయాలు అందించేందుకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



జొన్న సాగుకు జై!
యాసంగిలో ఆరుతడి పంటగా సాగు
మరో రెండు వారాల్లో చేతికి.. 7



కేబుల్ చోరీ.. నలుగురి రిమాండ్
రూ.20 లక్షలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం
వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేశ్ 7

ఘనంగా విమాన రథోత్సవం

కీసరగుట్టలో భక్తుల సందడి.. కొనసాగుతున్న రుద్రస్వాహాకార హోమాలు



రథోత్సవంలో నిర్వాహకులు, భక్తులు

కీసర, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టకు భక్తుల తాకిడి కొనసాగుతుంది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. శివరాత్రి మరుసటి రోజు కావడంతో భక్తులు ఉపవాస దీక్షలు విరమించి శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఉన్న శివలింగాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో తెల్లవారుజామున శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అన్నాభిషేకం, రుద్రస్వాహాకార హోమాలు, ప్రదోషకాల పూజలు, హారతి, మంత్రపుష్పం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మాఘ బహుళ చతుర్థశిని పురస్కరించుకొని విమాన రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్వామివారి ఉత్సవ మూర్తులకు బలిహరణ చేసిన అనంతరం రథోత్సవంలో స్వామివార్లను కీసరవాణి మీదుగా తామర కొలను వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యల్లో రథోత్సవంలో పాల్గొన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



గుట్టపై భక్తుల కోలాహలం

నేటి పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మాఘ బహుళ అమావాస్యను పురస్కరించుకొని ఉదయం శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం. సామూహిక అభిషేకాలు, ప్రదోష కాల పూజలు, హారతి, మంత్రపుష్పం, రాత్రి సమయంలో వసంతోత్సవం, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహిస్తారు.



తాగునీటికి తండ్లాట

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన రాంనగర్ వాసులు

కులకచర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనగర్ గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు గురువారం ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆందోళన చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అయినా మూడు నెలలుగా తమ గ్రామానికి మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడం లేదని ఆరోపించారు. ఉన్న బోరు మోటర్లు కాలిపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల ముందు చెత్త పేరుకుపోయినా ట్రాక్టర్ రావడం లేదని, కొత్త ఇళ్లు, రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీ డబ్బులు వస్తలేవని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



కల్యాణ తంతును వీక్షిస్తున్న భక్తజనం

వైభవం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం

పరమేశ్వరుడి గుట్టకు పోటెత్తిన భక్తులు.. దర్శించుకున్న స్పీకర్



భక్తులకు మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు

వికారాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకొని శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. వికారాబాద్ మండల పరిధిలోని పులుసుమామిడి పరమేశ్వరుడి గుట్టలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ప్రతి ఏడాది శివరాత్రి జాగరణ తర్వాత కల్యాణం నిర్వహిస్తారు. ముందుగా గ్రామం నుంచి గుట్ట వరకు రథోత్సవం నిర్వహించి అనంతరం కల్యాణం జరిపించారు. ఈవేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఆయనను స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

వైద్య సేవలపై క్షేత్రస్థాయి అధ్యయనం

పరిగి/దోమ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలు విస్తరించడానికి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నామని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ న్యూ ఢిల్లీ బృందం సభ్యులు డాక్టర్ రాజేశ్, డాక్టర్ సురేశ్ అన్నారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం పరిగి, చిట్యాల్ ఆరోగ్యకేంద్రం, చన్‌గోముల్, మన్నెగూడ, దోమ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన అసంక్రమిత వ్యాధులు, ట్యూబర్కులోసిస్ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, చికిత్స తదనంతరం సేవలు, మాతా శిశు సంరక్షణ, చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతలకు సరైన సమయంలో వైద్య సేవలు అందుతున్నాయా.. లేదా? అనే అంశాలపై అధ్యయనం చేశారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్యకేంద్రాల్లో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పేదలకు అందుతున్న వైద్య సేవలు, వసతుల గురించి నివేదిక రూపంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు అందజేస్తామని తెలిపారు. దోమ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, పరిసరాలు, డెలివరీ గది, ఫార్మసీ గది, ల్యాబ్ గదిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్, డాక్టర్ రవీంద్రయాదవ్, ప్రోగ్రాం అధికారులు పవిత్ర, బుచ్చిబాబు, నిరోషా, టీబీ జానీ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.



చిట్యాల్ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు రాజేశ్, సురేశ్

రేపటి నుంచి అభయాంజనేయ స్వామి జాతర

కొడంగల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సంగాయిపల్లిలో శ్రీ అభయాంజనేయస్వామి జాతరను శనివారం నుంచి రెండు రోజులు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. మార్చి 1న పంచామృతాభిషేకం, సింధూర లేపనం, 2న పెరుగు బసంతం, భజన ఉంటాయని తెలిపారు.

స్వలాభం కోసం పనిచేసిన బీఆర్ఎస్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్వలాభం కోసమే పనిచేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం బుగ్గోనిగూడ, బండోనిగూడ, చేగుర్, వెంకమ్మగూడ, మామిడిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింలు, ఇతర నాయకులతో కలసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బుగ్గోనిగూడలో మహిళా సమాఖ్య భవనం, వెంకమ్మగూడలో పంచాయతీ భవనం, బండోనిగూడ, చేగూర్, మామిడిపల్లిల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులకు వారి స్వలాభాలు తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకోలేదని, పదేండ్లలో కొన్ని గ్రామాల్లో తట్టెడు మట్టి పనైనా చేయించలేదని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి బండోనిగూడశివారు మద్దూరు వద్ద సకల హంగులతో ఫాంహౌజ్ కట్టుకున్నాడని, ఆయన ఫాంహౌజ్ వరకు రోడ్డు వేయించుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో మాజీ మంత్రి తన ఫాంహౌజ్‌కు చేగూర్, బుగ్గోనిగూడల నుంచి వేలాది ట్రిప్పుల మట్టిని తరలించాడన్నారు. అనంతరం నందిగామలో నిర్మిస్తున్న బస్‌స్టాండ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, నవీన్‌గౌడ్, పసుల బుచ్చయ్య, బుగ్గ నర్సింలు, మంకాల శ్రీశైలం, శివ, కావలి క్రిష్ణ, సాలయ్య, సాములయ్య, వీరేందర్, శ్రావణ్, సీతారాములు, శేఖర్, రాజశేఖర్, అంజుమ్‌గౌడ్, రవితేజ, గిరి, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే స్వగ్రామం వీర్లపల్లిలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణంలో ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అప్పారెడ్డిగూడ లింగంమూర్తులస్వామి ఆలయం వద్ద అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ బోర్డులో ఇద్దరికి చోటు



ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌లతో టెలికాం బోర్డు సభ్యులు పెంటయ్య, వెంకటయ్య

పరిగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పరిగి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరు బీజేపీ నాయకులకు టెలికాం అడ్వైజరీ కమిటీ బోర్డులో అవకాశం లభించింది. పరిగికి చెందిన వేముల పెంటయ్య, కులకచర్ల మండలం ఘనాపూర్‌నకు చెందిన వెంకటయ్యగౌడ్‌లను టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులుగా నియమించారు. నియామకపు పత్రాలు అందుకున్న పెంటయ్య, వెంకటయ్యగౌడ్ గురువారం జరిగిన సమావేశంలో మొదటిసారిగా హాజరయ్యారు. తమకు టెలికాం బోర్డు సభ్యులుగా నియామకానికి సహకరించిన ఎంపీలు కొండా విశేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఓబీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరప్పలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న యాదయ్య

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):రామోజీ ఫిలింసిటీ వద్ద ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నాగన్‌పల్లి ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి పొజిషన్ చూపలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల గోడును పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైనా ఇళ్ల స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సామేల్, బుగ్గరాములు, నర్సింహ, గణేష్, లింగస్వామి, ఆనంద్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకు మృతి కేసులో కోడలు రిమాండ్

బషీరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో తల్లీకొడుకు మృతి చెందిన కేసులో మృతుడి భార్య రేణకను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని బషీరాబాద్ ఎస్సై పి.శంకర్ గురువారం తెలిపారు. ఈ నెల 25న కాశీంపూర్‌లో మాల ఎల్లమ్మ, ఆమె కొడుకు మొగులప్ప ఇంట్లో దూలానికి ఉరేసుకున్న స్థితిలో అనుమానాస్పదంగా మృతిచెందారు. వారి బంధువు నర్సమ్మ పోలీసులకిచ్చన ఫిర్యాదులో తన అన్న మొగులప్ప భార్య రేణుక ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేసింది. తల్లీకొడుకు మృతికి రెండు రోజుల ముందు రేణుక పోలీసులను ఆశ్రయించి తన భర్త మొగులప్ప జీతం డబ్బులు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసింది. రేణుక ఫిర్యాదుతో అవమానంగా భావించిన తల్లీకొడుకు మనో వేదనతో ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చనే అభిప్రాయం మొదట వ్యక్తమైంది. తన భర్త, అత్తలతో రేణుక తరచూ గొడవ పడేదని, వీరిని సరిగా చూసుకోకపోవడంతో వారు పక్క గదిలో వేరుగా నివాసం ఉండేవారని బంధువులు తెలిపారు. రేణుక అత్త ఎల్లమ్మ, భర్త మొగులప్పను వేధించడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరి మృతికి కారణం రేణుకేనంటూ పోలీసు విచారణలో బయటపడటంతో గురువారం ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా మరింత విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై వెల్లడించారు.

ఫిరంగి నాలాపై కబ్జాలను తొలగించాలి



శంషాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్‌లోని కాముని చెర్వు పక్కనున్న ఫిరంగి కాలువపై కబ్జాలను అధికారులు వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు నర్రాగిరి, యాదగిరి అన్నారు. శంషాబాద్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. నాలాపై కబ్జాలను తొలగించాలని ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా అప్పటి ప్రభుత్వాల వత్తిడితో పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అయినా అధికారులు ఫిరంగి నాలాపై కబ్జాలను వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలి



కస్తూర్బా పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

యాలాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షల వొత్తిడికి లోనుకాకుండా బాగా రాయాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం యాలాలలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తూ సూచనలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక వొత్తిడికి గురికావొద్దన్నారు. పరీక్షలంటే భయపడకుండా బాగా చదివి రాయాలన్నారు. కార్యక్రమంలో యాలాల ఎస్సై గిరి, కాలేజీ ప్రిన్సిపాల్ మంగమ్మ, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భూమి కాపాడని అధికారులపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని గౌడవెల్లి పరిధిలో సర్వే నంబర్లు 331/1, 2, 352, 364/1, 2, 365/1, 2లోని మొత్తం 29ఎకరాల 24గుంటల కంపోజిట్ ఎవాక్యూ ప్రాపర్టీని తప్పుడు నివేదికలతో ప్రైవేట్ వ్యక్తుల పరంచేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గత 12ఏళ్లుగా తాను ప్రభుత్వ భూమిని కాపాడేందుకు తాను చేసిన సుదీర్ఘ పోరాటంపై స్పందించిన జిల్లా కలెక్టర్ సదరు సర్వే నంబర్లలోని 29 ఎకరాల 24గుంటల భూమి సంబంధించిన క్రయ విక్రయాలను నిలిపి వేస్తు తాజాగా ఆదేశాలు జారీ చేశారన్నారు. కాగా తప్పుడు రికార్డుల ఆధారంగా ఎవాక్యూ భూమిని సొంతం చేసుకున్న వ్యక్తులపై, వారికి సహకరించిన రెవెన్యూ శాఖ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి ప్రైవేట్ పరమైన ఈ అంశంలో మేడ్చల్ తహసీల్దార్ దగ్గర నుంచి ఆర్డీఓ, కలెక్టరేట్ కార్యాలయంలో పలు హోదాల్లో విధులు నిర్వహించిన వారు తప్పుడు నివేదికలు ఇచ్చి ఉన్నతాధికారులకు తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఈ భూ కుంభకోణంపై విచారణ చేయించిన కలెక్టర్ సదరు భూముల క్రయ విక్రయాలను నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని తప్పుదోవపట్టించేలా నివేదికలు ఇచ్చిన కిందిస్థాయి అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

వన దుర్గాభవానీ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



నవాబుపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడుపాయల వన దుర్గాభవానీ ఆలయాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ పురోహితులు స్వాగతం పలికి సన్మానించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వరి గడ్డికి భారీ డిమాండ్

యాచారం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎండలు ముదురుతున్న కొద్దీ పచ్చగడ్డి కరువై ఎండుగడ్డికి డిమాండ్ పెరుగుతోంది. గ్రామాల్లో రైతులు హార్వెస్టర్లతో వరి కోస్తుండడంతో వరి గడ్డి భారీ మొత్తంలో చేతికందడం లేదు. హార్వెస్టర్ కోస్తుండగా చేతికందే కొద్ది మొత్తం బేలర్లతో కట్టలు కట్టిస్తున్నా డిమాండ్‌కు సరిపడా లభించడం లేదు. ఎండల్లో పాడిపశువులకు, ఎద్లు, దున్నపోతులకు మేతగా వరిగడ్డి వేస్తారు. స్థానికంగా అవసరానికి సరిపడా ఎండుగడ్డి లభించకపోవడంతో రైతులు, పశుపోషకులు నాగార్జునసాగర్, హాలియా తదితరప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో వరి గడ్డి తెచ్చుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం వరకు యాచారంలో ట్రాక్టర్ లోడ్‌కు రూ.18వేలకు విక్రయించారు. ఇప్పుడు ట్రాక్టర్ లోడ్ గడ్డి రూ.22,500కు చేరింది. వరి గడ్డి రేటు పెరగడంతో కొనలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. పది రోజులు దాటితే వరి గడ్డి ధర మరింత పెరుగుతుందని చెప్పారు. ఈ సారి వర్షాలు ఎక్కువ పడక నేలపై పచ్చిక ఎక్కువ లేదని, దీంతో వరి గడ్డి ధర అమాంతం పెరిగిందన్నారు.



మాల్‌లో తరలిస్తున్న ఎండు గడ్డి



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా శివపార్వతుల పరిణయోత్సవం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం అంతారంలో గల ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం సైతం కొనసాగాయి. మూడు రోజులు ఉత్సవాలు జరిగాయి. భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్‌నాయక్, రాష్ట్రపతి అవార్డీ, ఆల్ ఇండియా బంజార సేవా సంస్థ అధ్యక్షుడు శంకర్‌నాయక్ కుటుంబీకులతో శివలింగానికి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గురువారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిగింది. అనంతరం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. పల్లకిసేవలో వీరభద్రఖడ్గాలు, భజన కీర్తనలతో తండా మార్మోగింది. భక్తులు నీటిమార్గం గుండా ద్వాదశ జ్యోతిర్లింగా ప్రతిరూపాలను దర్శించుకున్నారు.



శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు



సోమలింగేశ్వరాలయం చుట్టూ బండ్లను తిప్పుతున్న భక్తులు

అలరించిన ఎడ్లబండ్ల ప్రదక్షిణలు

చౌదరిగూడ,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల సోమలింగేశ్వరస్వామి ఆలయం చుట్టు గురువారం ఎడ్లబండ్ల ప్రదక్షిణలు నిర్వహించారు. పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. రావిర్యాలకు చెందిన గుమ్మి శర్వలింగం జ్ఞాపకార్థం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

మల్లన్నస్వామి కల్యాణం

షాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సాయిరెడ్డిగూడలో మల్లన్నస్వామి కల్యాణాన్ని గురువారం నిర్వహించారు. బాజాభజంత్రీల మధ్య పండితులు కల్యాణాన్ని జరిపించారు. గ్రామస్థులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను తిప్పారు. ఏటా శివరాత్రి నుంచి మూడు రోజులు నిర్వహించే జాతరకు స్థానికులతో పాటు నందిగామ, కొత్తూర్, శంషాబాద్, ఫరూఖ్‌నగర్, మొయినాబాద్, చేవెళ్ల ప్రాంతాల భక్తులు వచ్చి దర్శించుకుంటారు.



మల్లన్నస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు



బోనాల ఉత్సవంలో మహిళలు

మల్లప్పగుట్టకు పోటెత్తిన భక్తులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నారం పరిధి మల్లప్పగుట్టపై గల మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం కడవ(బోనాలు) కార్యక్రమాన్ని నిర్వహించారు. గుట్ట ఉదయం నుంచి రాత్రి వరకు జనసంద్రంగా మారింది. చెన్నారం, యెడవల్లి, చుక్కాపూర్, ఖానాపూర్, వితాయపల్లి, మంగళపల్లి, జంగారెడ్డిపల్లి, పడకల్ గ్రామాల నుంచి మహిళలు పసుపు, పట్టు వస్త్రాలు ధరించి బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. జాతరలో వేలాది సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మల్లప్పగుట్ట వద్ద ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల సీఐ శివప్రసాద్ పర్యవేక్షణలో ఎస్సైలు శ్రీకాంత్, వెంకటేశ్, వరప్రసాద్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, నాయకులు కల్లు పెంటారెడ్డి, మ్యాకం పాండయ్య, ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రంగారెడ్డి, శివుడు, డి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామి ఆలయంలో నాయకులు, భక్తుల పూజలు



సిద్ధేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి-అర్చన దంపతులు

నందీశ్వరాలయంలో పూజలు

నందివనపర్తి నందీశ్వరాలయంలో గురువారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి-అర్చన దంపతులు స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఉదయశ్రీ-రవీందర్‌రెడ్డి దంపతులు, డీసీసీబీ చైర్మన్ కె.సత్తయ్య ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు కొంగళ్ల జోగిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

యాచారం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి)





ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో బీసీజీ టీకాపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

బీసీజీ టీకా తప్పక వేయించుకోవాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో క్షయ వ్యాధి ప్రబలకుండా బీసీజీ టీకా వేయించుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.అప్పారావు సూచించారు. ఈ వ్యాధి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. గురువారం ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో బీసీజీ టీకాపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 60 ఏళ్ల పైబడిన వారు, అతిగా మద్యం సేవించేవారు, పొగ తాగేవారు, పోషకాహార లోపం ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, ఇంతకుముందే టీబీ వ్యాధి సోకినవారు బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీహెచ్‌ఎంవో డా.సుధామాధవి, పీఎండీటీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, డీపీఎం విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ జోషి

'నిఖిల్ చేతన్'లో చండీహోమం

కందుకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నిఖిల్‌చేతన్ కేంద్రంలో గురువారం అమావాస్యను పురస్కరించుకొని చండీ హోమాన్ని నిర్వహించారు. ఆశ్రమ గురూజీ అనిల్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రతీ అమావాస్య నాడు నిర్వహించే చండీ హోమానికి తెలుగు రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, గుజరాత్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాల భక్తులు హాజరవుతారు. కాగా మూడు రోజులు నిర్వహించే హోమానికి వచ్చే భక్తులకు ఆశ్రమంలో వసతులు కల్పించారు. రోజుకు మూడుసార్లు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సనాతనధర్మంపై గురూజీ వివరించారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామి అఖండజ్యోతి యాత్ర

ఘట్‌కేసర్‌కు అఖండ జ్యోతియాత్ర

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని బర్కత్‌పుర నుంచి ప్రారంభమైన శ్రీలక్ష్మీనరసింహ స్వామి 31వ అంఖండ జ్యోతి యాత్ర గురువారం ఘట్‌కేసర్‌కు చేరింది. ఈ యాత్ర పోచారం మున్సిపాలిటీ నారపల్లి, జోడిమెట్ల, అన్నోజిగూడ మీదుగా ఘట్‌కేసర్ చేరింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడలో గల శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నాయకులు జ్యోతికి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఘట్‌కేసర్‌కు చేరిన జ్యోతి యాత్రకు భక్తులు హారతులిచ్చారు. యాత్ర ఘట్‌కేసర్‌లోనే బసచేసి శుక్రవారం ఉదయం తిరిగి ముందుకు వెళ్లనుంది.

జొన్న సాగుకు జై!

- యాసంగిలో ఆరుతడి పంటగా సాగు
- మరో రెండువారాల్లో చేతికి

పరిగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తగ్గుతున్న భూగర్భ జలమట్టాలతో రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తిపలికి ఆరుతడి పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ప్రధానంగా వానకాలంలో సాగయ్యే జొన్నపంటను యాసంగిలోనూ సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బోర్ల కింద జొన్నపంటను వేశారు. నీటి కొరతతో ఆరుతడి పంటల్లో భాగంగా జొన్నసాగుకు మక్కువ చూపుతున్నారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రజలు బియ్యానికి ప్రత్యామ్నాయంగా జొన్నరొట్టె ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటున్నారు. దీంతో మార్కెట్‌లో సన్న బియ్యం కంటే జొన్నల ధరే ఎక్కువ ఉంది. కొత్త రకాల వంగడాలు ఏ సీజన్‌లో వేసినా దిగుబడిలో మార్పులేకపోవడంతో యాసంగిలోనూ జొన్న పంటను సాగు చేస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో జొన్నలకు పెరుగుతున్న డిమాండ్‌తో రైతులు ఆ పంటనే ఎక్కువ సాగుచేస్తున్నారు. పైగా వరితో పోలిస్తే ఈ పంటకు నీటి అవసరం తక్కువ. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో జొన్నసాగు పెరిగింది. యాసంగిలో 20 మండలాల్లో 7వేలకుపైగా ఎకరాల్లో జొన్న సాగు చేశారని అధికారులు చెబుతున్నారు. బోర్ల కింద సాగైన జొన్న చేలు ఏపుగా పెరిగాయి. నీరున్న చెరువుల కిందా జొన్ననే సాగు చేశారు. జొన్న నీటి తడులు తక్కువైనా తట్టుకుంటుందని రైతులు చెబుతున్నారు. జొన్నచేలు గింజ గట్టిపడే దశలో ఉన్నాయి. రెండు నీటి తడులైతే సరిపోతుందని, 15 నుంచి 20 రోజుల్లో కోతకొస్తుందని రైతులు పేర్కొంటున్నారు.



సుల్తాన్‌పూర్‌లో జొన్న చేను

వరికి బదులు జొన్న వేశాం



ఈ ఎండకాలం పంటగా నేను జొన్న సాగు చేశాను. చేను బాగానే ఉంది. ఎండలు ఎక్కువైనా కొద్దీ బోర్లలో నీరు తగ్గుతుంది. అందుకే వరికి బదులు జొన్న వేశాం. రెండు వారాలైతే పంట చేతికొస్తుంది. జొన్న సాగుకు ఖర్చులూ తక్కువే. అయితే ఇత్తు గట్టిపడినంక పిట్టల బాధ మాత్రం ఉంటుంది. పొద్దంతా పక్షుల బారినుంచి పంటను రక్షించుకోవాలి.

- లింగం, రైతు, సయ్యద్‌మల్కాపూర్

బషీరాబాద్‌లో స్వల్పంగా పెరిగిన సాగు విస్తీర్ణం

బషీరాబాద్: మండలంలో యాసంగిలో ఈ ఏడాది తెల్లజొన్న సాగు పెరిగింది. గతంలో ఈ ప్రాంతంలో నాలుగు వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో తెల్ల జొన్నను సాగు చేసేవారు. ఈ పంట విస్తీర్ణం ఏటేటా తగ్గింది. కాగా గతేడాది యాసంగిలో 594ఎకరాల్లో పంట వేశారు. ఈ ఏడాది స్వల్పంగా పెరిగి 664ఎకరాల్లో వేశారని అధికారులు పేర్కొన్నారు. ఆహారంగా తెల్ల జొన్నలకు డిమాండ్ ఉండటంతో రైతులు మళ్లీ ఈ పంట సాగువైపు మళ్లుతున్నారు. రేగడి భూముల్లో వర్షాధారంగా రైతులు జొన్న సాగు చేస్తారు. పర్వత్‌పల్లి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, నవాల్గ, జీవన్గి, మైల్వార్, దామర్‌చెడ్, గొట్టిగఖుర్ధు, కాశీంపూర్, మంతట్టి గ్రామాల్లో ఒకప్పుడు తెల్లజొన్నను ప్రధాన పంటగా సాగు చేసేవారు. తక్కువ పెట్టుబడి, మంచి దిగుబడి, తుక్కువ నీరు, చీడపీడల బెడద లేకపోవడం వంటివి ఈ పంటకు కలిసొచ్చే అంశాలు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడొచ్చేది. అప్పట్లో మార్కెట్లో జొన్నల రేటు తక్కువగా ఉండడంతో రైతులు వరి, కూరగాయలు, పత్తి, కంది వంటి వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపగా దీని సాగు విస్తీర్ణం పడిపోయింది. ఇక్కడ పంటకు అడవి పందుల బెడద ఎక్కువవడం కూడా సాగు విస్తీర్ణం పడిపోయేందుకు మరో కారణంగా రైతులు చెబుతారు. ప్రస్తుతం చక్కెర(షుగర్) వ్యాధిగ్రస్తులు ఎక్కువగా తెల్లజొన్నల ఆహారాన్నే తింటుండడంతో తెల్ల జొన్నలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది క్వింటాల్ జొన్నలకు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు ధర ఉండే ఆవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.



కేబుల్ చోరీ.. నలుగురి రిమాండ్

- పరారీలో మరో ముగ్గురు
- రూ.20లక్షలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేశ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో కాపర్ కేబుల్ దొంగలించిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీసీపీ రాజేశ్ గురువారం అడిషినల్ డీసీపీ, ఏసీపీ కె.శ్రీనివాస్‌రావుతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎయిర్‌పోర్టు ఏరినాలో కొంత కాలంగా మామిడిపల్లికి చెందిన మహ్మద్ ఖాదర్ ఖాన్, అదిల్ల శ్రీకాంత్, ఉప్పుగూడకు చెందిన కెతావత్ బాషా, ముషీరాబాద్‌కు చెందిన అబ్దుల్ వహీద్, పరారీలో ఉన్న మహ్మద్ హుస్సేన్, ఖుర్షీద్ హుస్సేన్, వహీద్ అలీలు కాపర్ కేబుల్ వైర్లను చోరీ అమ్ముకుంటున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఏడుగురితో ముఠాగా ఏర్పడి కేబుల్ చోరీ చేస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితులు ఖాదర్ ఖాన్, శ్రీకాంత్, బాషా, అబ్దుల్ వాహిద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, హుస్సేన్, ఖుర్షీద్ హుస్సేన్, వహీద్ అలీ పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి రూ.20లక్షల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని డీసీపీ ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో సీఐ బాల్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు ఆమనగల్లులో స్వాగతం



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న జైపాల్‌యాదవ్, నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఇంజినీర్లు, కార్మికుల కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యల పరిశీలనకు గురువారం శ్రీశైలం వెళ్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు గురువారం కడ్తాల, ఆమనగల్లుల్లో ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, నాయకులతో కలిసి శ్రీశైలం వెళ్తున్న హరీశ్‌రావు కడ్తాలలో మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ నివాసం వద్ద, ఆమనగల్లులో కొద్ది సేపు ఆగి కార్యకర్తల యోగక్షేమాలు తెలుసుకున్నారు. కడ్తాలలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ దశరథ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు ఆనంద్, రామకృష్ణ, సేవ్యానాయక్, ఆమనగల్లులో మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ ఖలీల్, దోనాదుల కుమార్, సుభాష్, సైదులు గౌడ్, సతీష్‌లు స్వాగతం పలికారు. జైపాల్‌యాదవ్ శ్రీకృష్ణుడి పుస్తకాన్ని హరీశ్‌రావుకు బహూకరించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజాసమస్యలపై పోరాడాలని హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు శంకర్, మహేశ్, అంజి, తులసీరామ్, లాయక్‌అలీ, శివకుమార్, గణేశ్, రమేశ్‌నాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

దోమ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని సీనియర్ నాయకులు మాలి శివకుమార్‌రెడ్డి, అర్జున్, నర్సింహులు అన్నారు. లింగస్‌పల్లి అనుబంధ గ్రామం ఎల్లారెడ్డిలో గురువారం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.4లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్య, బల్ల దస్తయ్య, చిత్ర వెంకట్, హెచ్.దస్తయ్య పాల్గొన్నారు.

చౌడాపూర్: వీరాపూర్‌లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ నాయకులు గురువారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో గ్రామాలు, తండాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన

- ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన సాధ్యమవుతుందని ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, సూపర్‌వైజర్ బి.రాములు తెలిపారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో బాలాజీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి జాతరలో వైఆర్‌జీకే తరపున హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాల నుంచి వచ్చిన వారికి హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి పరీక్షలు వంద మంది వరకు చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది అనంతలక్ష్మి, అనిత, సునీత, ఆశ వర్కర్స్, ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

ఇసుక పర్మిట్లు ఇవ్వొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

యాలాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామ సమీపంలోని కాక్రవేణి నది నుంచి ఎలాంటి ఇసుక పర్మిట్లు ఒవ్వొద్దని విశ్వనాథ్‌పూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు యాలాల తహసీల్దార్ అజయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, ముస్తఫా, అశోక్‌లతోపాటు పలువురు మాట్లాడుతూ. తమ గ్రామ సమీంలోని కాక్రవేణి నది నుంచి ఇసుకను తరలించడం వల్ల చుట్టుపక్కల గల బోరు బావుల్లో నీరు అడుగంటిపోతోందన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఇకనుంచి తమ వాగు పరిసర ప్రాంతాల నుంచి ఇసుక అనుమతులు ఇవ్వరాదని తహసీల్దార్‌ను కోరారు.

కంకర వేశారు.. తారు మరిచారు!



కంకర వేసి వదిలేసిన రోడ్డు

దుద్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుదురుమళ్ల ప్రధాన రోడ్డు నుంచి దుద్యాల మండల కేంద్రం మీదుగా హకీంపేట్ వరకు దాదాపు 17కిలో మీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.50కోట్లు మంజూరు చేసింది. హకీంపేట్ నుంచి దుద్యాల గేటు వరకు పనులు చేపట్టారు. రోడ్డుపనుల్లో భాగంగా కంకర వేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా రోడ్డువేసే విషయాన్ని కాంట్రాక్టర్ విస్మరించారు. కంకర వేసిన రోడ్డుపై రాకపోకలు కొనసాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. తరచూ బైక్‌లు ఆ మార్గం మీదుగా వెళ్తూ అదుపుతప్పి కింద పడుతున్నారు. రాత్రి వేళల్లో పొలాల దగ్గరికి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

భూసమస్యల వల్లే పనులు ఆలస్యం

రోడ్డు నిర్మాణంలో అక్కడక్కడ భూసమస్యల కారణంగా బీటీరోడ్డు నిర్మాణంలో కొంత ఆలస్యం జరుగుతోంది. సమస్య పరిష్కారానికి ఈనెల చివరి లోపు పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **మహేశ్, ఆర్‌ఎం డబ్ల్యూ ఏఈ**

ప్రమాదాలకు గురవుతున్నారు



కంకర వేసిన రోడ్డు మీదుగా బైక్‌పై వెళ్తుంటే అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర వేసి దాదాపు 4 నెలలు గడుస్తోంది. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

- బుస్స చంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

ధారూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ధారూరు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి తాండూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీరేశం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ధారూరు-తాండూరు రైలు మార్గంలో 89వ కిలోమీటరు వద్ద రైలుపట్టాల మధ్యన పడుకున్న గుర్తుతెలియని యువకుడిని రైలు ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్యాంగ్‌మెన్ ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న హెడ్‌కానిస్టేబుల్ వీరేశం శవ పంచనామా నిర్వహించారు. మృతుడిని గుర్తించటానికి ఎలాంటి ఆధారాలు లభించలేదని ఆయన చెప్పారు. యువకుడి శరీరంపై స్పోర్ట్స్ బ్లూకలర్ పాయింట్, బ్లాక్ కలర్ టీ షర్టు ధరించి ఉన్నాడని ఆయన తెలిపారు. కాళ్లకు ఉన్న యాష్ కలర్ షూ పక్కనే పడేశాడని, పట్టాల మధ్యన ఉన్న ఇనుప కొండ్లను పట్టుకుని యువకుడు ఆతహత్మకు పాల్పడ్డాడని ఆయన చెప్పారు. మృతదేహాన్ని తాండూర్‌లోని రైల్వే ఆస్పత్రిలో భద్రపరుస్తామన్నారు. సంబంధీకులు తమను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చెరువులో ఈతకు వెళ్లిన వ్యక్తి మృతి

కీసర రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లి, సిక్ విలేజ్‌కు చెందిన అర్జీ వీరేష్(43) తన కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి మేడ్చల్ జిల్లా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చాడు. కాగా స్నానం చేసేందుకు ఉదయం గుట్ట దిగువ భాగాన ఉన్న నూర్‌మహ్మద్ చెరువు వద్దకు చేరుకున్నాడు. స్నానం చేసేందుకు చెరువులోకి దిగి ఊపిరాడక నీళ్లు మింగాడు. దీంతో అతడు చెరువులో మునిగి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని స్థానిక గజఈతగాళ్ల సాయంతో గంటల తరబడి శ్రమించి వీరేష్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరేష్ మృతితో ఆయన కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలపను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ధారూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని అంపల్లి చౌరస్తా వద్ద బుధవారం రాత్రి కలపతో వెళ్తున్న ట్రాక్టర్‌ను అటవీ సిబ్బంది పట్టుకున్నారు. ధారూరు స్టేషన్ సమీపంలోని ఓ ఫ్యాక్టరీకి అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అంపల్లి చౌరస్తా వద్ద అటవీ సిబ్బంది పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. కాగా ఈకలపను పీసీఎం తండా నుంచి స్టేషన్ ధారూరు సమీపంలోని ఓ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు సమాచారం. ట్రాక్టర్‌లో ఉన్న కలపను పరిశీలించి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించిన తదుపరి చర్యలు తీసుకుంటామని రేంజర్ రాజేందర్ తెలిపారు.

మార్మోగిన శివనామస్మరణ

● వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు



ధారూరు: శివాలయంలో లింగోద్భవ పూజల్లో భక్తులు



బషీరాబాద్: జీవన్గి శ్రీ మహదేవలింగేశ్వరాలయం వద్ద రథోత్సవంలో భక్తులు



పరిగి: సయ్యద్‌పల్లిలో శివపార్వతుల కల్యాణ ఉత్సవాల్లో చైర్మన్ పరశురాంరెడ్డి, తదితరులు

బషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవన్గి శ్రీ మహదేవలింగేశ్వరాలయం జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం కమిటీ నిర్వహకులు గురువారం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పార్వతీపరమేశ్వరుల తరఫున పట్లోళ్ల వీరారెడ్డి దంపతులు కూర్చున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహదేవలింగేశ్వరుడిని దర్శించుకుని ఉపవాస దీక్షలు విరమించారు. ఆలయ పరిసార ప్రాంతంలో అన్నదానం చేపట్టారు. జాతర ఉత్సవాల్లో భాగంగా నేడు(శుక్రవారం) చివరి రోజు శ్రీమహదేవలింగేశ్వరాలయం వద్ద కాగ్నానదిలో ఆలయ కమిటీ తరఫున కుస్తీపోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో స్థానికులతో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కుస్తీవీరులు హాజరవుతారు. ఈ పోటీల కోసం ఆలయ కమిటీ నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పరిగి: మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని శుక్రవారం కనుల పండుగగా నిర్వహించారు. పరిగిలోని బ్రాహ్మణ వాడ శివాలయంతోపాటు, మండల పరిధిలోని సయ్యద్ పల్లి, బసిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో శివ భక్తులు స్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సయ్యద్‌పల్లిలో జరిగిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బి.హరిప్రియప్రవీణ్ రెడ్డి, రిటైర్డు తహశీల్దార్ చిన్నయ్య తదితరులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ధారూరు: ధారూరు శివాలయంలో శివరాత్రి సందర్భంగా లింగోద్భవ పూజలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత లింగోద్భవ కాలంలో శివలింగానికి జలం, పంచామృతంతో అభిషేకం చేసి అలంకరించి హారతినిచ్చారు.

కొడంగల్: పట్టణంలోని మహాదేవ శివాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం రాత్రి శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దేముల్: తట్టెపల్లి అటవీప్రాంతంలో వెలసిన శ్రీఅంబురామేశ్వర ఆలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువనాయకులు మహిపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కోహిర్‌రవి, ముకుంద్‌రెడ్డి, డీవై.నర్సిములు, విద్యాసాగర్ మిత్రబృందం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేష్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

యాలాల: మండల పరిధిలోని గోవిందరావుపేట లింగమూర్తిని జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా దర్శించుకున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్, బీసీసెల్ మండల అధ్యక్షుడు జక్కేపల్లి అమృతప్ప, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య తదితరులు ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. వారి వెంట కార్యదర్శి హైమద్, ఖాసీం, వీరన్న, అయ్యప్ప, హన్మంతు ఉన్నారు.

కులకచర్ల: మహాశివరాత్రి సందర్భంగా ఉపవాసం ఉన్న భక్తులకు గురువారం ఉదయం పాంబండ దేవాలయం దగ్గర ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తమ సొంత డబ్బులతో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాంబండ దేవాలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: శివరాత్రిని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి జాగరణతో ఆలయాలల్లో శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కొడంగల్ పట్టణంలోని మహాదేవ, గాడిబావి శివాలయం, శ్రీ వేంకటేశ్వర ఆలయంలో మండల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. కస్తూర్‌పల్లి శివారులోని లొంక బసవన్న ఆలయంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందనూర్ మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, పెద్దనందిగామ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, గ్రామస్తులు వెంకట్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, దాసరి వెంకటప్ప, చాకలి ఆశోక్, కట్టెల ఆశోక్ పాల్గొన్నారు.

వికారాబాద్: మునిసిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామంలో మాజీ కౌన్సిలర్ గోపాల్ ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు గ్రామ పెద్దలు పాండు, నర్సింహులు, గోపాల్ దంపతులు పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. ఈవేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పెద్దేముల్: తట్టెపల్లి సమీపంలోని శ్రీఅంబురామేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు



కొడంగల్ రూరల్: కస్తూర్‌పల్లి లొంకబసవన్నకు పూజలు



యాలాల: గోవిందరావుపేట లింగమూర్తిని దర్శించుకుంటున్న అక్బర్ బాబా, తదితరులు



వికారాబాద్: మద్గుల్ చిట్టంపల్లిలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవంలో గ్రామస్తులు

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ



రంజాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ధారూరు, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): హైదరరాబాద్‌లోని బహదూర్‌పురా ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ గురువారం ధారూరులో రంజాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఐఎం మండలాధ్యక్షుడు మోహిజ్ ఖురేషి ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు జమీర్ ఖురేషి, మహబూబ్, నబీ, నజ్మా పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్యాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న పీఎంకేకే పరిగి బ్రాంచ్ మేనేజర్ వినయ్

పరిగి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కలిగి ఉండాలని పీఎంకేకే పరిగి బ్రాంచ్ మేనేజర్ వినయ్ అన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో కౌశల్ సంఘమ్‌పై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ప్రోగ్రాం నిర్వహణ ద్వారా యువతకు దేశీయ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలపై నమ్మకం కలిగించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు రెగ్యులర్ డిగ్రీలు కాకుండా వృత్తిపరమైన డిగ్రీలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లవి కాలేజి ప్రిన్సిపల్ తేజ, శంకర్‌రావు, బోనయ్య పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మురికి కాల్వ శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో కరీం

పరిగి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ వీధులు, ఇళ్ళ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పరిగి ఎంపీడీవో ఎంఎ కరీం అన్నారు. మండలంలోని చిగురాల్‌పల్లి గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. గ్రామంలో మురికి కాలువల్లో పేరుకుపోయిన మురికి దగ్గర ఉండి శుభ్రం చేయించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుమిత్ర, నాయకులు సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐను కలిసిన హోంగార్డులు



ఆర్‌ఐ డేవిడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చాంద్ పాషా

వికారాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ హెడ్ కౌంటర్ అడ్మిన్, హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఆర్‌ఐ డేవిడ్‌ను హోంగార్డులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ ఆర్గనైజ్ సెక్రటరీ చాంద్‌పాషా హోంగార్డుల తరుపున జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథం, ప్రభాకర్, చారి తదితరులు పాల్గొన్నారు.

గాయకుడికి ఎమ్మెల్యే సన్మానం



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరురూరల్, ఫిబ్రవరి 27, (ఆంధ్రజ్యోతి): తనపై పాటపాడిన గాయకుడిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు. మండల పరిధిలోని మిట్టబాస్పల్లి గ్రామానికి చెందిన గాయకుడు లక్ష్మణ్ తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై పాట పాడారు. దీంతో గురువారం ఎమ్మెల్యే తన కార్యాలయానికి లక్ష్మణ్‌ను పలిపించి ఆయన పాడిన పాటను విన్నారు. అనంతరం శాలువాతో సన్మానించారు. లక్ష్మణ్ పాట అద్భుతంగా పాడారని, చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇంకా మంచి పాటలు పాడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ ఇస్మాయిల్, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్, చిన్న నర్సింహులు, పెద్ద ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కొడంగల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ జీవీ.సత్యనారాయణ అన్నారు. కొడంగల్ పట్టణ శివారులోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను గురువారం వారు సందర్శించారు. పాఠశాలలో భోజనం, స్టోర్ రూంలో వంట సామగ్రి బియ్యం తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, విద్యాబోధనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

పోలీసు స్టేషన్లకు చేరుకోనున్నాయి. పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం లేకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహించేందుకు రెండు సిట్టింగ్ స్క్వాడ్, డెక్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ఎప్పటిలాగే పరీక్ష కేంద్రాల చుట్టూ వంద మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు కొనసాగనున్నాయి.

పరీక్ష కేంద్రాలు ఇలా..

ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 16,439 మంది విద్యార్థులు ఫీజు చెల్లించగా, ఫస్టియర్ 7914 మంది విద్యార్థులు రాయనుండగా, వారిలో 6418 మంది జనరల్ విద్యార్థులు, 1496 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. సెకెండియర్ పరీక్షలు 6963 మంది విద్యార్థులు రాయనుండగా, వారిలో 5589 మంది జనరల్, ఒకేషనల్ 1374 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేట్‌గా మరో 1562 మంది ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్‌లో 8, తాండూరులో 7, పరిగిలో 5, కొడంగల్‌లో 2, కులకచర్లలో 2, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, మర్పల్లి, పెద్దేముల్, దోమలో ఒక్కో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో 11 ప్రభుత్వ పరీక్షా కేంద్రాలు, 12 ప్రైవేట్ అన్ ఎయిడెడ్, 4 టీఎస్‌డబ్ల్యుఆర్‌సీ కేంద్రాలతోపాటు టీఎంఆర్‌జే కళాశాలలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు.

ఆలస్యమైతే అంతే..

ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనున్నాయి. ఉదయం 8.15 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష రాయడం పూర్తి చేసినా పరీక్ష సమయం ముగిసిన తర్వాతనే విద్యార్థులను బయటకు వదులుతారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఇతర గ్రామాల నుంచి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరేందుకు వీలుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించేలా చర్యలు చేపడుతున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు అత్యవసర వైద్య సహాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

బోర్డు ఆదేశాలు విధిగా పాటించాలి



ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆదేశాలను తప్పనిసరిగా పరీక్షా కేంద్రాల నిర్వాహకులు పాటించాలి. హాల్ టికెట్‌లో ఫొటో, సబ్జెక్టులు, సంతకం వంటివి సరిగా ఉన్నాయా, లేదా అనేది విద్యార్థులు సరి చూసుకోవాలి. ఏమైనా పొరపాట్లు, తప్పులు ఉంటే వెంటనే సంబంధిత కళాశాల ద్వారా మా దృష్టికి తీసుకురావాలి. ఫీజు బకాయిల పేరిట హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- శంకర్‌నాయక్, ఇంటర్ విద్యా శాఖ జిల్లా నోడల్ అధికారి, వికారాబాద్

ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌బీ.గుల్షన్, నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మార్చి 1న ఎంఐఎం 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ అన్నారు. ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మార్చి 1న ఉదయం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ రుమాన్, సయ్యద్ ముస్తాఫా, ఎండీ.సర్తాజ్ హుసేన్, షేక్ అజహర్, ఎండీ.షానవాజ్‌హుసేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి పాల్గొన్నారు.


కళాశాల చైర్మన్‌కు సన్మానం



సిదార్థ్‌రెడ్డిని సన్మానిస్తున్న హోలీమేరీ కళాశాల బృందం

కీసర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భోగారంలోని హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఆరిమండ సిదార్థ్‌రెడ్డి కళాశాల అధ్యాపకుల బృందం గురువారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఇటీవల సిదార్థ్‌రెడ్డికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా కళాశాల బృందం, విద్యార్థులు, కళాశాల కార్యదర్శి విజయశారదరెడ్డి, డైరెక్టర్ ప్రీతిరెడ్డిలు సిదార్థ్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల బాలుర పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. భోజనం, వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కార్యదర్శి జహంగీర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కులకచర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపహాడ్‌కు చెందిన అశోక్, హనుమంతులు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. వీరు స్థానిక ఉన్నత పాఠశాలలో 2002లో పదో తరగతి చదివారు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు స్పందించారు. గురువారం గ్రామానికి వెళ్లి అశోక్ భార్య స్వాతికి రూ.20వేలు, హనుమంతు భార్య జ్యోతికి రూ.32వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.